క్లుప్తంగా

ఘనంగా అమ్మవార్ల జాతర



ఆలయం వద్ద భక్తుల రద్దీ

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతతోట వద్ద ఉన్న మజ్జిగౌరమ్మ, భద్రకాళి అమ్మవార్ల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి కుటుంబ సభ్యులు తొలి పూజలు చేసి, పసుపు, కుంకమ, చీర, సారె సమర్పించా రు. అనంతరం అర్చకులు వెంకటరమణ, శ్రీనివాసశర్మ భక్తులతో అమ్మవార్లకు పూజలు చేయించారు. పెదమానాపురంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు జగదీష్ నాయుడు ఆధ్వర్యంలో ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

24న కొట్టాం గ్రామదేవత పండగ



కోటమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామదేవత కోటమ్మ తల్లి పండగను ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహించనున్నట్టు కోటమ్మ దేవస్థానం ఈఓ జి.శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 24వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 25న అనుపోత్సవం నిర్వహించేందు కు గ్రామపెద్దలు, ప్రజలు, పంచాంగకర్తలు నిర్ణయించారని పేర్కొన్నారు. అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



వల్లంపూడి సీతారాముల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వేపాడ: వల్లంపూడి గ్రామంలో సీతారాముల ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణులకు పురోహితులు రమణమూర్తిశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే రాయుడుపేటలో పరదేశమ్మవారి ఆలయ ప్రాంగణంలో పోతురాజు విగ్రహం ఏర్పాటు చేసిన సందర్భంగా నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

విద్యతోనే అభ్యున్నతి



స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: ఏ వ్యక్తి అభ్యున్నతికైనా చదువే మార్గమని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్‌లో జూనియర్ కళాశాలకు సంబం ధించి స్మార్ట్ క్లాస్ రూమ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ క్లాస్ రూమ్ విధానం ద్వారా డిజిటల్ అక్షరాస్యత, మాస్ కమ్యూనికేషన్ వృద్ధి చెందుతాయన్నారు. డీఈఓ మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ రామారావు, స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

శృంగవరపుకోట: పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో స్థానిక కోలపర్తి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలకు చెందిన బాయ్స్, గర ల్స్ హాస్టళ్ల విద్యార్థులకు వైద్యసిబ్బంది హెచ్‌బీ, బీపీ, సుగర్ పరీక్షలు, స్కాన్, గ్లూకోజ్ టెస్టులు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు వైద్యులు సూచించారు. కళాశాల కరస్పాండెంట్ సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, వార్డెన్‌లు, అధ్యాపక సిబ్బంది, కోలపర్తి ఆస్పత్రి ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క పూట బడి.. పర్యవేక్షణ తప్పనిసరి

- మండే ఎండలతో చిన్నారులకు పొంచి ఉన్న ప్రమాదం
- మధ్యాహ్న వేళల్లో జాగ్రత్తలు పాటించాలి



పాఠశాల విద్యార్థులు

విజయనగరం: వేసవి వేడిమి నుంచి విద్యార్థులు ఉపశమనం పొందేందుకు శనివారం నుంచి ఒక్క పూట బడులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 23వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు త్వరగా నిద్రలేచి ఉరుకులు, పరుగులతో బడికి వెళ్లి మధ్యాహ్నం ఇళ్లకు చేరుతారు. ఆ తర్వాత ఆటపాటలకు ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో పిల్లల ఆహారం, అలవాట్లు, ఆరోగ్యం, చదువు వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బయట తిరిగే పిల్లలతో బహుపరాక్..

పిల్లలు ఎంతగానో ఎదురుచూసే ఒంటిపూట బడులు రానే వచ్చాయి. మధ్యాహ్నం 12.30 గంటల వరకే పాఠశాలలు ఉంటాయి. తర్వాత ఇంటికి రాగానే బడి బ్యాగులను ఓ మూలన పడేసి బయటకు పరుగులు పెట్టడమే. స్నేహితులతో ఎంచక్కా చెట్లు, పుట్టలు, గట్ల వెంట తిరుగుతూ ఆటలాడటం, బావులు, చెరువుల వద్దకు వెళ్లడం, ఈత వచ్చినా రాకున్నా వాటిల్లోకి దిగి లేనిపోని ప్రమాదాలను కొనితెచ్చుకుంటుంటారు. ఈ నేపథ్యంలో పిల్లల విషయంలో తల్లిదండ్రులకు అప్రమత్తత అవసరం. పిల్లలను మధ్యాహ్నం బయటకు వెళ్లకుండా చూడడం మేలు. అలా అని వారు టీవీలు, సెల్‌ఫోన్‌లకు అంటిపెట్టుకుని ఉండటమూ తగదు. ఈ దశలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.



ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం..

వేసవిలో పిల్లలకు తేలికపాటి ఆహారం అవసరం. త్వరగా జీర్ణమయ్యే ఉప్మా, ఇడ్లీ వంటివి అల్పాహారంగా ఇస్తే మంచిది. పండ్ల రసాలు తాగించి పంపించాలి. నీరు ఎక్కువగా తాగిస్తే మంచిది. మరీ చల్లవి తాగించొద్దు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత తేలికగా ఉండే ఆహారం ఇవ్వాలి. వేపుళ్లు, మాంసాహారం వంటి వాటికి వేసవి పూర్తయ్యే వరకు దూరంగా ఉంటే మేలు. రాత్రి వేళ త్వరగా నిద్రించేలా అలవాటు చేయాలి. నిద్ర లేచిన తర్వాత కొంత సమయం చదువుకునేలా అలవాటు చేస్తే మేధాశక్తి పెరుగుతుంది.

– శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్యుడు

జాగ్రత్తలు పాటిస్తే మేలు..

- దినపత్రికలు చదివేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరచాలి. ఆదివారం అనుబంధం లాంటి మ్యాగజైన్‌లలో వచ్చే పజిల్స్‌ను సాధన చేయాలి. తద్వారా మెదడు పనితీరు చురుకవుతుంది. బొమ్మలు గీసేవి, గీసిన బొమ్మలకు రంగులు వేసే పుస్తకాలు సజనాత్మకతను పెంపొందిస్తాయి. పిల్లలు వీటితో గడిపేటట్లు చూడాలి.
- పిల్లలు బయటకు వెళ్లకుండా ఇంటివద్దే ఉంటూ.. స్నేహితులతో కబుర్లు చెప్పుకొంటూ క్యారమ్స్, చెస్ వంటి ఆటలు ఆడించాలి.
- ఆటల పరికరాలు అనేకం మార్కెట్‌లో దొరుకుతాయి. వాటితో ఇంటిలోనే చిన్నారులు భవనాలు, వంతెనలు, యంత్రాలను నిర్మించుకుంటూ మానసిక ఆనందం పొందవచ్చు.
- తల్లిదండ్రులు తమ బాల్యంలో ఆడుకున్న పరమపదసోపానం, వామన గుంతలు, పులి మేక దాడి, అష్టాచెమ్మా వంటి ఆటలను పిల్లలకు పరిచయం చేయాలి.
- 5 గంటల తర్వాత ఎండ తగ్గుముఖం పడుతుంది. అప్పుడు పిల్లలు బయట ఆటలు ఆడుకునేలా చూడాలి.
- రాత్రి 7 గంటల తర్వాత చదువుకోవడంపై విద్యార్థులు దృష్టి సారించాలి. హోమ్‌వర్క్ చేసుకోవాలి.
- ఒంటిపూట బడులు కావడం వల్ల పిల్లలు వేకువజామునే నిద్రలేవాల్సి ఉంటుంది. అందువల్ల రాత్రిపూట తొందరగా నిద్రపోవడం మేలు.

స్వచ్ఛభారత్‌కు తూట్లు..



నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం గ్రామంలో తాటిమాను చెరువు అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇటీవల రామతీర్థం పుణ్యక్షేత్రంలో మహా శివరాత్రి సందర్భంగా జాతర జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు చెరువు ప్రాంగణంలో గుడారాలు ఏర్పాటు చేసుకుని భక్తి శ్రద్ధలతో జాగారాలు చేశారు. అయితే పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు అక్కడే పారేయడంతో చెరువు ఆవరణ మొత్తం వ్యర్థాలతో దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – నెల్లిమర్ల రూరల్

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..



నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక బొప్పడాం ఉన్నత పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. సమీపంలోనే పాఠశాల ఉండడంతో విద్యార్థులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉంది. వాహనాలు మితిమీరిన వేగంతో వస్తున్నాయని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. – నెల్లిమర్ల రూరల్

నవ్విపోదురు గాక...!



రామతీర్థంలో సీసీ రహదారిపై పేరుకుపోయిన మురుగు నీరు

నెల్లిమర్ల రూరల్: మురుగు సమస్య పరిష్కరించకుండా టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తామని అధికారులు ప్రకటించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రామతీర్థం పుణ్యక్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రకటించారు. టెంపుల్ టూరిజం కింద బోడికొండపైకి రహదారి, రోప్ వే, మ్యూజియం ఏర్పాటు, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా బోడికొండకు వెళ్లే మార్గంలో ఏళ్ల తరబడి తిష్ట వేసి ఉన్న మురుగు సమస్యను మాత్రం అధికారులు పరిష్కరించలేకపోతున్నారు. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు బాగు చేస్తున్నప్పటికీ సమస్య కాస్తా ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉండడంతో పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదు. ప్రధాన రహదారిలో మినీ కల్వర్టు ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు ఈ సమస్యపై స్పష్టత ఇవ్వకపోవడంతో స్థానికులు ఏళ్ల కాలంగా మురుగులో మగ్గాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో ఈ రహదారి నుంచే బోడికొండకు రాకపోకలు సాగేవి. సీసీ రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తుండంతో ఆ రహదారిని ప్రస్తుతం ఉపయోగించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కష్టాలను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

విజయనగరం: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అమరజీవిగా ప్రతిఒక్కరి హృదయాలలో చిరస్మరణీయుడిగా నిలిచి ఉంటారని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అమరజీవి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. గాంధేయవాదైన పొట్టి శ్రీరాములు అహింసా మార్గాన్ని కొనసాగిస్తూనే ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం కడదాకా ఉద్యమాన్ని సాగించారన్నారు. ఆయన ఆశయాలతో మరింత ముందుకు సాగి అన్ని రంగాలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారాజు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

రేగిడి: వేసవి ఎండల నేపథ్యంలో అనారోగ్యం బారినపడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు సూచించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు ఎండలలో తిరగవద్దన్నారు. చిన్నారులతో ప్రయాణాలు చేసేటప్పుడు వారికి ఎండ తగలకుండా చూసుకోవాలన్నారు. ఎండల వేడికి శరీరంలోని నీరంతా చెమట రూపంలో బయటకు పోతుందని, అటువంటప్పుడు నిమ్మరసం, ఫ్లూయిడ్స్ తాగాలన్నారు. డయేరియా బారినపడితే తక్షణమే ఆశ కార్యకర్తకు సమాచారం ఇవ్వాలన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- నియోజకవర్గంలో పరీక్ష రాయనున్న 3,417 మంది విద్యార్థులు
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

మండలం	విద్యార్థులు
పూసపాటిరేగ	1058
నెల్లిమర్ల	1117
డెంకాడ	569
భోగాపురం	673



పదో తరగతి విద్యార్థులు

పూసపాటిరేగ: విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు కీలకం. ఈ నెల 17 నుంచి 31వ తరగతి వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది పూసపాటిరేగ మండలంలో 1058 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంగా 290 మంది, పూసపాటిరేగ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా 154 మంది, ఓక్‌ల్యాండ్ పాఠశాల కేంద్రంగా 260 మంది, ఆర్డర్ పాఠశాల కేంద్రంగా 189 మంది, రెల్లివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంగా 177 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలను అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేయనున్నట్లు ఎంఈఓలు పాపినాయుడు, ఎ. రాజ్‌కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా 3,417 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

సారా నిర్మూలనకు సహకరించండి

- ఎక్సైజ్ సీఐ వెంకటరావు



అప్పయ్యపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ సీఐ వెంకటరావు పిలుపునిచ్చారు. మండలంలోని సారా ప్రభావిత గ్రామమైన అప్పయ్యపేటలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సారాను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సారా తాగితే జీవితం అధోగతి పాలవుతుందని, మానితే పురోగతి లభిస్తుందన్నారు. అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు

దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని నూతనంగా నియమితులైన పార్టీ మండలాల అధ్యక్షులకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సూచించారు. నియోజకవర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ,జామి మండలాలకు పార్టీ అధ్యక్షులుగా నియమితులైన బూడి వెంకటరావు, రాపాక కృష్ణార్జున బొద్దల చిన్నంనాయుడు, జాగారపు అప్పారావు,గొర్లె రవికుమార్ విజ యనగరంలో మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్యను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై నమ్మ కం ఉంచి పార్టీ పదవులు ఇచ్చిన పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా పని చేస్తామని వారు చెప్పారు.

వైద్య, రక్తదాన శిబిరాలు



రక్తదాతలను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ రమేష్, నిర్వాహకులు

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఆదివారం వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వైద్య శిబిరంలో ఎస్ఆర్ఐ ఆస్పత్రి వైద్యులు 140మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదాతలకు, శిబిరాల నిర్వహణకు సహకరించిన వైద్యులు, స్థానిక నాయకులకు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రేవంత్, సాయికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, ఎస్ఆర్ఐ ఆస్పత్రి పీఆర్ఓ సత్యనారాయణ, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు రమేష్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.